# అయిదు రూపాయిల నోటు

అలారం గడియారం గణగణమంటూ మ్రోగింది. గాఢంగా నిద్రపోతున్న భానుమూర్తి ఉలిక్కిపడి లేచాడు.

వెధవ గడియారం! దానిష్టమువచ్చినప్పుడు మ్రోగుతుంది. దాని నోరుమూసి మళ్ళీ పడుకున్నాడు, దుప్పటి ముసుగుపెట్టి.

కాని నిద్రపట్టలేదు. మంచి నిద్రలో వుండగా ఒకసారి లేపితే మళ్ళీ నిద్రపట్టదు, తనకుమాత్రం అనుకున్నాడు. బద్ధకంగా లేచి మంచంమీద కూర్చొని ఒళ్ళు విరుచుకుంటూ కళ్లు తెరిచాడు.

ఎదురుగా పిల్లి. పెద్ద పనున్నట్టుగా, అతని కోసమే ఎదురుచూస్తున్నట్టుగా కూచొని వుంది. పిల్లిశకునంమీద అతనికంతగా నమ్మకం లేకపోయినా కళ్ళు తెరవగానే అది కనిపించేసరికి, అకారణంగా అతనికి దానిమీద చాలా కోపం వచ్చింది.

టైము చూశాడు. ఏడుగంటలవుతోంది. ఎనిమిదింటికల్లా ఆఫీసుకెళ్లాలి. హడావుడిగా లేచి టూత్ బ్రష్‌తో పళ్లుతోమటం మొదలుపెట్టేడు. ఉన్నట్టుండి జ్ఞాపకం వచ్చిందతనికి ఆ రోజు ఆదివారమని, ఆఫీసుకు సెలవని.

చాలా ఆనందమైందతనికి. అతనికే అనుమానం వేసింది. తనకెందుకింత ఆనందం? ఆ రోజు ఆదివారమని ముందరే తెలిసివుంటే, అంత ఆనందం పొందేవాడు కాదతను. తనిక వెళ్ళాలి అనుకుంటున్న సమయంలో సెలవని జ్ఞాపకం వచ్చేసరికి అదొకవిధమైన సంతోషం అదొకవిధమైన ఆనందం.

నెమ్మదిగా ముఖము కడగటం పూర్తిచేశాడు. ఆ రోజు తను చెయ్యవలసిన కార్యక్రమం ఏమిటో ఆలోచిస్తూ స్నానము చెయ్యటం పూర్తిచేశాడు.

బట్టలేసుకుందామని అల్మారు తెరిచేటప్పటికి యిస్త్రీబట్టలొకటీలేవు. బట్టలన్నీ మాసిపోయాయి. క్రితంరోజు వేసిన పంట్లామునే, కొంచెం సరిచేసి తొడుక్కున్నాడు. టేబుల్ మీదఉన్న పర్సు చూడగానే అప్పుడు జ్ఞాపకం వచ్చిందతనికి, అది సెలాఖరనీ, తన దగ్గిర డబ్బులు నిన్నటితోనే అయిపోయాయనీ.

బయటికెళ్దామని లేచినవాడు, పునూరుమంటూ కూలబడ్డాడు. ఏమిటి చెయ్యటం? తన కార్యక్రమమంతా డబ్బులు లేకపోవటం మూలాన, ధ్వంసమయిపోవలసిందేనా? ఆలోచనలో పడ్డాడు.

ఆలోచించటానికైనా ముందర కాఫీ తాగాలి. పర్సులో ఎంతవుందో అని లేచి చూశాడు. ఒక నయాపైస మాత్రం కనిపించింది. ఛీ!

తనను తనే తిట్టుకున్నాడు, అంత అజాగ్రత్తగా డబ్బు ఖర్చుపెట్టినందుకు.

కాసేపు ఆలోచించాడు భానుమూర్తి. ఇప్పుడు కాఫీకి కూడా డబ్బులు లేవే ఎలాగ? ఆ! జ్ఞాపకం వచ్చిందతనికి సిగరెట్టు డబ్బా సంగతి. గబగబా లేచి గూట్లోవున్న సిగరెట్టు డబ్బా తెరచి చూశాడు. అందులో కొన్ని కాసులున్నయ్.

అవి తను పడేసినవే. తన దగ్గిర చిల్లరగా కాసులొచ్చినపుడు, అందులో పడేస్తూవుండేవాడు. అవి యిప్పుడు అక్కరకొచ్చినయ్.

అవన్ని చేతులో పోసుకుని లెక్కపెట్టేడు. సరిగా తొమ్మిది కాసులున్నయ్. పరవాలేదు కాఫీ తాగేసెయ్యొచ్చు అనుకున్నాడు.

**"భగవాన్"**

అవన్నీ జేబులో పోసుకుని రూమ్ తాళం వేసి రోడ్డు మీదికి వచ్చేడు.

జేబులో కాసులన్నీ వున్నాయో లేదో తడుముకుంటూ హోటల్‌లోకి దారితీశాడు. మూలగా వున్న ఒక కుర్చీమీద కూచొని చుట్టూ చూశాడు. చాలా మంది యిడ్లీలు వేడివేడి సాంబారుతో పాటు లాగేస్తున్నారు.

హాయిగా సెలవురోజు ఎంజాయ్ చెయ్యకుండా తనకీ ఖర్మేమిటనుకున్నాడు. నిరుత్సాహంగా కాఫీ త్రాగటం పూర్తిచేశాడు.

క్యాషియర్ దగ్గరకు వెళ్ళి ఎనిమిది కాసులు టేబుల్ మీద పెట్టారు. అలా యివ్వటం ఎందుకో తనకే బాగాలేదు. తనని చూచి, తన కాసుని చూచి క్యాషియర్ ఎందుకో అదోవిధంగా నవ్వేడు.

భానుమూర్తికి రికాలిమంటనెత్తికెక్కింది. సాంబారు మొహమూ వాడూనూ తనని చూచి నవ్వుతాడూ! తన దగ్గిర డబ్బు లేక అలా యిచ్చేననుకున్నాడు కాబోలు. మనసులోనే తిట్టుకున్నాడు.

తన దగ్గిర నిజంగా డబ్బులు లేక పోయినా ఎదుటిమనిషి అలా అనుకున్నాడేమో నన్న ఊహ భానుమూర్తికి మహా చిరాకు కలిగించింది.

బయటకొస్తూ సిగరెట్టుకోసం జేబులో చెయ్యి పెట్టాడు. అవి కూడా ఐపోయినయ్. డబ్బులు లేకపోవటం ఎంత అవస్థగా వుంది ఇవ్వాళ, అనుకున్నాడు.

రోడ్డుమీద కొచ్చేడు. రోడ్డుమీద జనం అంతా హడావిడిగానడుస్తున్నారు. ఉసూరుమంటూ భానుమూర్తి అటూయిటూ చూస్తూ నడుస్తున్నాడు.

ఇంతలోనే అతనికి గోడమీద వున్న ఒక పోస్టర్ కనిపించింది. అది కొత్తగా వచ్చిన ఇంగ్లీషు పిక్చర్ "మిలియన్ పౌండ్ నోట్."

భానుమూర్తి మళ్ళీ మళ్లీ చూచాడు ఆ పోస్టర్ వంక. ఈ పిక్చర్ కోసమే తను చాలా రోజులనుంచి ఎదురు చూస్తున్నది. మార్క్ట్వేన్ కథ! ఎటూ కాని టైంలో వచ్చిందే. డబ్బులేవు. మిలియన్ పౌండ్ నోట్ పోగొట్టుకోవాల్సిందే. థియేటరు వాడు "ఒక రోజు మాత్రమే" అని వేశేడు. ఇంకోరోజుంచితే వాడి తాత సొమ్మేమన్నా పోయిందా!

భానుమూర్తికి ఒక్కసారిగా విచారం సెలువేసింది. తన దగ్గిర ఈ రోజు డబ్బులేకపోవడం మూలాన ఎంత యిబ్బందిగా వుంది మరి! ఇది పిల్లి ప్రభావమా? కాదు. కాకూడదు. తన దగ్గిర డబ్బులు నిన్నటితోనే ఐపోయినయ్. పిల్లేం చేయగలదు. దాని మొహం! అని సమాధానం చెప్పుకున్నాడు.

విచారంలో మునిగిపోయిన భానుమూర్తికి సడన్‌గా ఒక సుందరమైన చక్కని తీయని ఊహ తోచింది.

తన జేబులో యిప్పుడొక ఐదు రూపాయల నోటువుంటే ఎంత బావుంటుంది?

బావుండదు మరీ! చాలా బావుంటుంది. అద్భుతంగా వుంటుంది. మిలియన్ పౌండ్ నోట్ చూసెయ్యొచ్చు.

ఇలా ఊహా ప్రపంచంనుండి వాస్తవిక ప్రపంచంలోకి పడేటప్పటికి ఎవరో అంటున్నారు. "కొంచెం కళ్లుపెట్టుకు నడవరాదటయ్యా? మీద కొచ్చి పడతావ్" అని.

భానుమూర్తి అయోమయంగా చూచేడు. ఒక్క క్షణం ఆగేక తెలిసింది. తానప్పుడు రోడ్డు మధ్య వున్నాడని, ఆ మాటలు తన్ని గురించేనని, ఆ సమయంలో అతనెందువల్లో ఆ మాటలని అంతగా పట్టించుకోలేదు.

భానుమూర్తి మళ్ళీ ఆలోచిస్తున్నాడు.

తన దగ్గర ఐదు రూపాయలుంటే చాలా బావుంటుంది. కానీ తన కెలా లభిస్తాయి ఐదు రూపాయలు. ప్రస్తుత పరిస్థితుల్లో తనకి డబ్బు లభ్యమవటానికి రెండే రెండు మార్గాలున్నాయ్. ఒకటి, ఎక్కడన్నా దొరకాలి. ఈ మార్గం మీద భానుమూర్తి కసలు నమ్మకం లేదు. చిన్నప్పుడెప్పుడో అతను ఓ అణా పారేసుకున్నాడు. ఆరోజే అతనికి బేడ దొరికింది. ఛాన్సెలా వుంటుందో చూద్దామని ఆ బేడని ఎక్కడో దూరంగా పారేశాడు. అంతే! అప్పటికి యిప్పటికి అతని కెన్నడూ డబ్బులు దొరకలేదు. దెర్ ఫోర్, ఈ మార్గం లాభం లేదు, అనుకున్నాడు భానుమూర్తి.

ఇక పోతే, ఎవరన్నా అప్పివ్వాలి. తన కెవరు అప్పిస్తారు? తనకు పరిచయమున్న వాళ్ళందర్నీ ఒకొక్కరినే జ్ఞాపకం తెచ్చుకుంటున్నాడు.

ఎవరిస్తారు? రామ్మూర్తి. వాడిమొహం వాడేమి యిస్తాడు. శంకరంగాడు, అసలు యివ్వడు. ఇక పోతే, యిస్తే గిస్తే ఒక్క వెంకటేశంగాడు యివ్వాలి. ఈ మిగిలిన వాళ్ళంతా, తన దగ్గర పుచ్చుకునే వాళ్ళేతప్ప యిచ్చేవాడే లేడు.

తను చూస్తూ, చూస్తూ మిలియన్ పౌండ్ నోట్ వదులుకోలేడు, వెంకటేశం దగ్గర ఎలాగైనా ఒక ఐదు రూపాయలు సంపాయించాల్సిందే. భానుమూర్తి దృఢంగా నిశ్చయించుకున్నాడు.

వెంకటేశం యిల్లు చాలా దూరం. అయినాసరే. తప్పదు. ఎవడికోసం. నడికైనా సరే వెళ్ళాల్సిందే.

భానుమూర్తి త్వరగా అడుగులు వేయటం మొదలు పెట్టేడు.

తాను వెంకటేశం యింటికివెళ్ళి చాలా రోజులవుతోంది. ఇంత కాలానికి వాడింటికి వెళ్ళి, అప్పడు వస్తే ఏమీ అనుకోడు కదా!......ఆ! వాడలా అనుకునే స్వభావము కలవాడు కాదులే. వాడొక చిన్న పొలిటీషియన్. పట్టుకుంటే వదిలి పెట్టడు. ఎదుట మనిషి వింటున్నాడో లేదో అనైనా గమనించకుండా పొలిటిక్స్‌తో బోర్ చేసి వదిలి పెడ్తాడు. అందుకేకదా! వాడింటికి తాను తరచు వెళ్ళంది. కాని యిప్పుడు తప్పదు. అవసరం తనది కనుక.

వెంకటేశం యింట్లో అడుగు పెట్టగానే వాడే కనిపించాడు, హాల్లో పేపరు చదువుతూ.

"కమాన్ భాయ్. కమాన్. కూచో" అన్నాడు పేపరు బల్లమీద పెడుతూ. తనెందుకు వచ్చాడో కనుక్కోకుండానే మొదలు పెట్టేడు.



హైదరాబాద్‌లోని వై. ఎం. సి. ఏ. హాలులో స్వాతంత్ర్య వార్షికోత్సవం రోజున ఆంధ్రఉద్యోగి కళామండలివారు ప్రదర్శించిన 'మురికి పేటలు' అనే నాటకంలో విశ్వేశ్వరరావు పాత్ర నటించి ప్రేక్షకుల అభిమానం చూరగొన్న శ్రీ వేణు.

"చూశావటోయ్ పేపర్. సెంట్రహూ మన కెంత అన్యాయం చేశారో. మనం, యింత మంది వున్నామా!, దేశంలో వున్న పెద్ద రాష్ట్రాలలో మనది ఒకటా!, కాని ఏం లాభం, సెంట్రల్ కేబినెట్‌లో మన రిప్రజెంటేషన్ లేదు." ఈ ధోరణిలో అరగంట సాగింది ఉపన్యాసం. భానుమూర్తి కసలు వీటిలో ఇంటరెస్టులేదు. ఈ అరగంట సేపు, "ఊఁ ఆ!" అనటం తప్ప ఇంకేమీ చెయ్యలేకపోయాడు.

అరగంటపైన బోర్ చేశాక అప్పుడు విచారించాడు వెంకటేశం, భానుమూర్తి ఏస్థితిలో వున్నదీనూ.

"ఏం! భాయ్! పొద్దున్నే వచ్చావ్? ఏమిటి సంగతి" అన్నాడు, పేపర్ లోకి చూస్తూనే.

"అమ్మయ్య!" నిట్టూర్పు విడిచాడు భానుమూర్తి. ఎంత హాయిగా వుందీ ప్రశ్న. ఇటువంటి ప్రశ్నకోసమే తాను అరగంట నుంచీ నిరీక్షిస్తున్నది. భానుమూర్తికి ప్రాణం లేచి వచ్చింది.

"నీతో చిన్న పనుండే వచ్చానోయ్," అన్నాడు. ఏమిటన్నట్టు చూశాడు వెంకటేశం.

"పెద్ద పనేమీ కాదనుకో, ఓ ఐదు రూపాయలు అవసరంగా కావాలి, ఇస్తావేమోనని..." సందేహిస్తూనే అన్నాడు భానుమూర్తి.

వెంకటేశం ఒక్క నిముషం ఆలోచించి "ఉండు ఇప్పుడే వస్తాను," అని లోపలికి వెళ్ళేడు.

డబ్బు తెస్తాడు కాబోలు. భానుమూర్తి ఆనందంతో ఉప్పొంగి పోయాడు. అతని ఊహలో మిలియన్ పౌండ్ నోట్ మెదిలింది.

పొద్దున తన కెదురైన పిల్లికూడా తన మీదేమీ పనిచెయ్యలేక పోయింది. తనెంత పవర్‌ఫుల్! భానుమూర్తి సంతోషం పట్టలేక పోతున్నాడు.

ఇంతలోనే, వెంకటేశం బయటికి వచ్చాడు, ఇంకేదో పేపర్ చంకలో పెట్టుకుని.

"ఆ! ఏమిటన్నావ్? ఇందాక?" అన్నాడు.

భానుమూర్తి క్రుంగిపోయాడు. తను యిందాక చెప్పినది, వినిపించుకున్నట్టు లేదు.

"ఆ! ఏమీ లేదు. ఓ ఐదు రూపాయలు కావాలి అన్నాను" అన్నాడు మళ్ళీ, వెంకటేశం ముఖకవళికలను పరిశీలిస్తూ.

కాని వెంకటేశం ముఖంలో పెద్ద మార్పేమీ కనుపించలేదు.

"సారీ బ్రదర్. నాదగ్గర కూడా లేదు.




ఆ చెడు దగ్గును అపుటకు

పెప్స్‌ను సేవించుడు

దగ్గులు, జలుబులు, గొంతు నొప్పి, రొమ్ము పడిశెము, ఇన్ఫ్లుయంజ మరియు ఇతర గొంతు, గుండె జబ్బులు, గుండెకు, ఊపిరి తిత్తులకు ప్రమాదకరంగా అమిత క్రమను కలిగించును. పెప్స్‌తో తక్షణ విముక్తిని పొందుడు. పెప్స్‌లోని శమనకర, అంటు విరోధక ఔషధసారములు, దగ్గును అపును, మంటతో గూడిన వాపును రహిత మొనర్చి, రేగిన నొప్పిని శమనపర్చి, ప్రమాదకర క్రిములను నశింపజేయును. చిన్నలు, పెద్దలు కూడ, సేవించ వచ్చును. ఇందు హానికర ఓషధులు లేవు.



PEPS

పెప్స్ గొంతు మరియు గుండెల అంటు విరోధక బిళ్లలు

FPY-39-TEL

సోల్ ఏజెంట్లు: దాదా అండ్ కంపెనీ, 86, తైనప్ప నాయక్ వీధి, మద్రాసు-1.




# అయిదురూపాయల నోటు

చాలా తెలాఖరేగా. రెండురోజులాగితే యిస్తా" అన్నాడు తాపీగా, కుర్చీలో కూర్చొంటూ.

భానుమూర్తికి పటరానికోపం వచ్చింది. ఇంతసేపూ కూచోబెట్టి వీడు చెప్పే సమాధానం యిదా? పైగా రెండురోజులాగితే యిస్తాట్ట. విధవ రెండురోజులాగితే వీడిచ్చేదేమిటి? తనే యిస్తాడు కావాలంటే. ఇంతసేపూ వీడి గ్యాస్ విన్నందుకే యివ్వవచ్చునే!

తప్పదు కనుక, బలవంతాన కోపం తగ్గించుకొని "అయితే యిక సెలవస్తా!" అన్నాడు నీరసంగా.

"శుభం" అన్నాడు, వెంకటేశం కుర్చీలోంచి లేవకుండానే.

భానుమూర్తి రోడ్డుమీద కొచ్చిపడ్డాడు. టైముచూశాడు; పది అవుతోంది. అప్పుడప్పుడే ఎండ చురచురమంటోంది.

భానుమూర్తికి కోపంగానూ, విచారంగాను వుంది, ఇంతదూరం వచ్చి ఫలితం లేకపోయిందే అని. వెంకటేశం ఇలా చేస్తాడని తానెన్నడూ అనుకోలేదు. తానెంత ఆశాభంగము పొందింది తలుచుకుంటుంటే, భానుమూర్తికి కోపం పెలుబికిపోతోంది.

ఆముదం తాగినముఖంతో నడక ప్రారంభించాడు. ఊరిచివర అవటంవల్ల నేమో అక్కడ అట్టే జనంలేదు. నీరసంగా నడుస్తున్నాడు భానుమూర్తి.

కొద్దిదూరం వెళ్లేక, భానుమూర్తియొక్క నీరసం, విచారం అన్నీ ఒకసారి ఎగిరిపోగల దృశ్యం ఒకటి కనబడింది. అతను సంతోషంతో ఉక్కిరిబిక్కిరి అయ్యాడు.

పొద్దుటినుంచి తాను దేనికోసమైతే తపిస్తున్నాడో, దేనికోసమని యింతదూరం కాళ్ళీడ్చుకుంటూ వచ్చాడో, ఆ అయిదు రూపాయల నోటు! సన్నని సిమెంటురోడ్డు మీద, గాలివల్ల అటూ యిటూ నాట్యం చేస్తోంది. మడతలు విడిన ఐదురూపాయల నోటు భానుమూర్తికది నిజమో భ్రమో తెలియటంలేదు. ఒకసారి గిల్లుకుని చూశాడు నిజమే. భానుమూర్తి కదిప్పుడు మిలియన్ పౌట్ నోట్ విలువ చేస్తుంది.

ఆ ఐదురూపాయల నోటు కనిపించడం నిజమేనని తేల్చుకోగానే, భానుమూర్తికి గుండెలు, గబగబా కొట్టుకున్నయ్. అటూ యిటూ చూశాడు. మనుషులెవరన్నా వున్నారేమోనని, ఎవరూ కనుపించలేదు. గబగబా రెండడుగులు ముందుకువేసి, ఆ ఐదురూపాయల నోటును, తొందరగా పంట్లాము జేబులో వేశాడు. ఆ సమయంలో భానుమూర్తి ఏదో దొంగపని చేస్తున్నవాడిలా ఫీలైనాడు.

# ★ ఐదురూపాయలనోటు ★

ఈ పనిచేసి రెండడుగులు ముందుకు వేశాడో లేదో, పక్కనున్న సందులోంచి, రామ్మూర్తి—అతని పాలిటి శత్రువులా—ఎదురయ్యాడు.

అతన్ని చూడగానే భానుమూర్తి తెగఖంగారు పడిపోయాడు. తడబడ్డాడు. తను ఐదు రూపాయలనోటు తియ్యటం వాడుచూడ లేదుకద తనదని డబాయిస్తాడేమో. వీడూ యిప్పుడేరావాలీ! భానుమూర్తి ఊరికే గాభరా పడ్డాడు.

అంతలోకే రామ్మూర్తి భానుమూర్తిని సమీపించాడు. భానుమూర్తి రామ్మూర్తి ముఖంలోకి ఒక్కసారి పరిశీలనగా చూశాడు.

"ఫరవాలేదు. తనునోటు తియ్యడం వీడు గమనించి నట్టులేదు," అనుకున్నాడు, కొంచెం స్తిమిత పడ్డాడు.

"ఏంరా! అలా చూస్తావేం గుడ్లగూబలా? నేనే!" అన్నాడు రామ్మూర్తి సమీపిస్తూ.

"ఆ! అబ్బే! ఏమీలేదు. ఎక్కణ్ణించి వస్తున్నావ్?" అన్నాడు భానుమూర్తి కొంచెం సర్దుకొంటూ.

"నీకోసమే తిరుగుతున్నాను. ఇప్పుడు నీరూమ్‌నుంచే వస్తున్నాను. రూమ్ తాళం వేసుందీ," అన్నాడు రామ్మూర్తి.

"నా కోసమా? ఏమిటి సంగతి"

"ఆ! ఏముంది, మామూలే అవసరంగా కావాలి, ఓ ఐదురూపాయ లిప్పిస్తా. వేమోనని మీ రూమ్‌కెళ్లేను. నువ్వక్కడలేవు. అదృష్టవశాత్తు యిక్కడ కనిపించేవ్" అన్నాడు రామ్మూర్తి.

భానుమూర్తికి యించుమించుగా తల తిరిగింది. గుడ్ గాడ్! తను ఐదురూపాయల నోటు తియ్యడంచూచి వీడిలా అడగటం లేదుకదా! ఐదురూపాయలతో ఎంతమందికి అవసరం వచ్చింది? •

భానుమూర్తి ఒక నిశ్చయానికొచ్చేశాడు "నే నెక్కణ్ణించి తెచ్చి యివ్వగలనోయ్. నెలాఖరుకదూ! నా దగ్గిర దమ్మిడికూడా లేదు," అన్నాడు పంట్లాము జేబులోంచి కర్చీఫ్‌తీసి ఎండవల్ల ముఖముమీద పట్టిన చెమట తుడుచుకుంటూ.

ఆ సమయంలో, భానుమూర్తి ఊహించనటువంటి,-అతనికి సంబంధించినంతవరకూ-విషాద సంఘటన ఒకటి జరిగింది. భానుమూర్తి పంట్లాము జేబులోనుండి కర్చీఫ్ తీసినపుడు, దానితోపాటు ఆ దొరకిన ఐదు రూపాయల నోటు, జేబులోంచి క్రింద పడింది.

ఆ విషయం వెంటనే భానుమూర్తి గ్రహించాడు. అతని గుండెలు గబగబా కొట్టుకున్నయ్. ఆ నోటు రామ్మూర్తి చూస్తే ఇంకేమన్నా వుందా? ఇంతకు పూర్వమే, తను, తనదగ్గిర దమ్మిడికూడా లేదనిచెప్పేడు అటువంటప్పుడు, తన జేబులోంచే ఐదు రూపాయలు క్రిందపడడం, అతనుచూస్తే ఏమనుకుంటాడు? తనని గూర్చి దురభిప్రాయం ఏర్పడదూ!

అదృష్టవశాత్తు రామ్మూర్తి ఆనోటుక్రింద పడటం చూచినట్టులేదు.

"అయితే లేదన్నమాటేగా? వస్తా!" అన్నాడు రామ్మూర్తి వెళ్ళిపోవటానికి వెనక్కి తిరుగుతూ.

భానుమూర్తి గుండెలు గబగబా మళ్ళీ ఓసారి కొట్టుకున్నయ్. కాని ఈసారిసంతోషంతో! రామ్మూర్తి క్రిందపడ్డ నోటును చూడకుండా వెళ్ళిపోతున్నందుకు వాడు కొంచెందూరం పోతే తానానోటును,తీసేసుకోవచ్చు.

కాని, ఇంతలోనే రామ్మూర్తి వున్నట్టుండి వెనక్కి తిరిగేడు. "ఇప్పుడు వెంకటేశం యింట్లోవుంటాడా?" అన్నాడు.

రామ్మూర్తి వెనక్కి తిరగటంతోనే, భానుమూర్తి ఉత్సాహమంతా ఎగిరిపోయింది.

"ఉండొచ్చు" అన్నాడు నిరుత్సాహంగాను, రామ్మూర్తి నోటును ఎక్కడ చూస్తాడోనన్న భయంతోను.

భానుమూర్తి అనుకున్నంతా అయింది. రామూర్తి ఈసారి ఆ నోటును, చూడనే చూసేడు. క్రిందికివంగి భానుమూర్తి కాళ్లకు, కొంచెందూరంలో, గాలికి రెపరెపలాడుతున్న ఆ నోటును పైకితీసేడు రామ్మూర్తి. భానుమూర్తి నిశ్చేష్టుడై అలా చూస్తూవుండిపోయాడు.

"ఇది నీదికాదుకదా?" అన్నాడు రామ్మూర్తి భానుమూర్తికి ఆనోటును చూపిస్తూ.

భానుమూర్తికి ఏడుపొచ్చినంతపనైంది. ఆ నోటును, ఏముఖముపెట్టుకుని తనదని చెబుతాడు. ఇంతకుపూర్వమేగా తన దగ్గిర దమ్మిడీకూడా లేదని చెప్పింది. ఒకవేళ తనదేనని చెప్పినా వాడు నమ్మొద్దూ "ఒక్కక్షణం క్రితంవరకూ డబ్బులేదన్నాడు. ఇప్పుడీ నోటు కనుపించగానే తనదంటున్నాడు." అని వాడనుకోడూ. "ఒకవేళ తనదేనని వాడు నమ్మినట్లయితే డబ్బులుంచుకునికూడా యిందాక లేవన్నాడు." అని తనమీద దురభిప్రాయం ఏర్పడదూ వాడికి?

వెల్లవేసిన ముఖంతో ఏమీ ఎరగనట్టూ "ఏదీ, ఇదా? అబ్బే నాదికాదు. అసలు నాదగ్గిరెక్కడున్నాయ్ డబ్బులు పోవడానికి," అన్నాడు భానుమూర్తి లోలోపల ఏడ్చేస్తూ.

"థ్యాంక్ గాడ్! నేనివాళ ఎవరిముఖం చూచేనో అదృష్టంబాగుంది. వస్తా. గుడ్ బై" ఐదురూపాయలనోటు జేబులో పెట్టుకుని ఇట్టే మాయమయ్యాడు రామ్మూర్తి.

"నేనెవరి ముఖం చూశానివ్వాళ!" తనలోతను ప్రశ్నించుకుంటున్నాడు, భానుమూర్తి. పావుకాలంగా ఏడవటానికి అతనికిప్పుడు తీరిక చిక్కింది. "వెధవపిల్లి వెళ్ళగొట్టాలి యింట్లోంచి," అనుకుంటున్నాడతను.

జేబులోకొచ్చిన నోటుపోయిందే. ఆ వెధవ! రామ్మూర్తిగాడు తనకు ఎదురవకుండా వున్నట్లయితే ఆ నోటు తనకే దక్కేది.

ఏమైతేనేం పోయింది ఐదురూపాయల నోటు "ఆ! పోక, దొరికినసొమ్ము వుంటుందా, ఏమిటి?" అని స్తిమితపడదల్చుకున్నాడు భానుమూర్తి.


సందుమలుపు తిరిగేటప్పటికి ఎదురుగా గోడమీద పోస్టర్ కనుపించింది.

"మిలియన్ పౌండ్ నోటు"

"ఒకరోజుమాత్రమే."

దాన్ని చూచేసరికి మళ్లీ ఒక్కసారి దుఃఖం పెల్లుబికింది భానుమూర్తికి. అది రోడ్డుకాబట్టి లోలోపలే బావురుమన్నాడు.

దోవలో అనుకుంటున్నాడు భానుమూర్తి రూమ్‌కెడుతూ, "పోయింది ఐదు రూపాయల నోటా? మిలియన్ పౌండ్ నోటా?" ★



పాపాయి నవ్వు

—ఫొటో: టి. జి. కృష్ణరావు, రాజమండ్రి.]